"నా ప్రాణం ఇస్తాను నీకు. అదే నేను చెప్పాలనుకుంది" అన్నాడు.

"నీ పాదాలుపట్టి నిన్ను వేడుకుంటాను, నన్ను మరిచిపో"

"ఇంక కనపడవా?"

"కనబడక ఏమౌతాను?"

"ఐతే నే నూరుకోను"

"వూరుకుని తీరాలి"

"చూస్తాను కదూ! నిన్ను ఇప్పణ్నించీ వెళ్ళనీను"

అని నుంచున్న ఆమెని కౌగిలించుకున్నాడు. ఆమె గట్టిగా కావిలించుకుంది. కళ్లు తెరిచేటప్పటికి ఆమె లేదు. బిందె మాత్రం వుండిపోయింది, ఆ వింత సంఘటనకి సాక్షిగా.

అట్లా వాకిట్లో కూచుని ఆలోచిస్తో ఎప్పుడు నిద్రపోయినాడో సూర్యారావు, కళ్ళు తెరిచేటప్పటికి చాలా పొద్దెక్కింది. బిందె లేదు. రాత్రి తలుపు గడియ వెయ్యడం కూడా మర్చిపోయినాడు గావును.

మర్నాడు సాయంత్రం, నున్నని ఇనపకడ్డీల్ని వెండికింద మార్చే సాయంత్రం, వెన్నెలలో పంపు దగ్గిరికి నడిచాడు. నీళ్ల పట్టుకుని అప్పటికే వెళ్ళిపోతోంది ఆమె. కొంచెం ధైర్యంచేసి అటే నడిచాడు తను కూడా. అతనికి నమ్మకం రావడంలేదు, నిజంగా ఆమె మాట్లాడదని. బిందె బరువుతో జారుకున్న నడుముని చూస్తో మళ్ళీ ఆ నడుము కిందనించి చేతులు పోనిచ్చి దన దగ్గిరికి లాక్కోకుండా ఎట్లా బ్రతకగలడు? అనేదే ప్రశ్న.

"నన్నెరగరని చెప్పలేదూ? వెళ్ళండి, వెళ్ళండి. ఇంక రాకండి"

"నువ్వెవరో, నీ భయ మేమిటో చెప్పాలి"

"నేనేం చెప్పను? నేను రాను. మీరు వెళ్ళిపొండి. చెపుతోంటే మనిషి కాదూ?"

చచ్చుపీనిగల్ని ఇద్దర్నీ తన్నాడు గావును ఆ మహాయోధుడు! అంతకన్నా గజకర్ణుడు లేడనుకుంటున్నావు. కనుక్కున్నాంలే వ్యవహారం! వాణ్ని అట్టే వెనకేసుకోచ్చావంటే నిన్నూ తంతాం జాగ్రత్త. ఏమిటో మావాట్ట, తనవేపు చూడకుండా ఉండలేట్ట, ఎందుకు వుండలేడూ? నువ్వేం రంభవా, దమయంతివా? పద, పద మహ గొప్పగా ఉంది. ఇటూ అటూ రెండూ తంతే సరి. ఎందుకు చూడకుండా ఉండలేడూ? ఏంరా సూర్యారావ్? చూడకుండా ఉండలేవా? నిన్నూ తంతే సరి నాలుగు! ఏం ఆడవాళ్ళు లేరా ఇంక? ఇదేనా మొనకత్తె! ఏముందే విశేషం నీ దగ్గర?...." ఇంకా ఏముందో పరీక్షలోకి వెళ్ళబోతో ఉంటే తప్పించుకు పారిపోయింది లిల్లీ. ముగ్గురూ పకపక నవ్వారు. అలిసి గావును గోడవేపు తిరిగి పండుకున్నాడు సూర్యారావు.

ఖాదర్ని ఆ రాత్రే తన్నాలని నిశ్చయించుకున్నారు వాళ్ళు. కన పడితే లిల్లీని కూడా. చప్పున సూర్యారావు వాళ్ళవేపు తిరిగి,

"మీకేం బుద్ధిలేదా? దాన్నెందుకురా?" అన్నాడు.

"బతికే ఉన్నావా? మీ ముగ్గురి అంత్యక్రియలూ ఓ సారే చేసి పోదామనుకున్నా. ఏమిట్రా, ఎందుకు తన్నకూడదూ దాన్ని?"

"అదేం చేసిందిరా?"

నవ్వాడు సుబ్బారావు ఆస్పత్రి అదిరేట్లు!

"అదేం చేసిందట! ఆ పక్కమీద కూచుని అడుగుతున్నాడు చూడు!"

"ఈ పూరొచ్చి వీడికి మతి పోయిందిరా!"

"ఆడదిరా."

"అదేం చేసిందా విను. ఏం చెయ్యాలి? ఇట్లాంటి ఆడవాళ్ళు పబ్లిక్ మెనెస్. ఏమిట్రా వీళ్ళు! ఊరికే నడుస్తారా తోవ వెంబడి అందరికిమల్లే! పిర్రలు ఊపుతారు. ఇటూ అటూ కళ్ళల్లోంచి పక్క చూపులు విసురుతారు.

